# కనబడుటలేదు

రైలు దిగిన వామనరావుకి ఒక నిముషం ఎటువెళ్ళాలో తోచలేదు రిక్షావాళ్ళు అతన్ని చుట్టుముట్టేరు ముతక ఖద్దరు ఫేంటూ, మాసిపోయిన చొక్కా, అరిగిపోయిన హవాయీ చెప్పులు, పెరిగిన గడ్డం- అప్పుకోసం బయలుదేరినవాడిలా వున్నాడేమో- అతనివేపు టాక్సీల వాళ్ళు అసలు చూడనేలేదు.

తనకి రిక్షా అనవసరం అని వాళ్ళని తప్పించుకుని బయటపడేసరికి వామనరావుకి నీరసం కమ్ముకొచ్చింది. జేబులోనుంచి రుమాలుగా వాడుతున్న పాత పంచెగుడ్డ ముక్కనొకదాన్ని తీసి, ముఖం తుడుచుకున్నాడు. ఎండ బాగానే కాస్తోంది. నీడకోసం అతని మనసు ఆరాటపడింది. అటూ యిటూ చూసేడు. చిన్న షామియానా వేసి, కూల్ డ్రింక్సూ, సోడాలూ అమ్మే షాపొకటి కనిపించింది. అక్కడకి నడిచేడు.

''లస్సీ యిమ్మంటారా సార్?''

వామనరావు అతనివేపు చూసేడు. అతనలా అడగడంలో వింతలేదు. పనిమాని తనక్కడి కొస్తే అడగడూమరి? వాడి వ్యాపారం వాడిది. నలుగురు యువకులు కబుర్లు చెప్పుకుంటూ డ్రింక్స్ తాగుతున్నారు. తనూ ఓ డ్రింక్ ఏదేనా తీసుకుంటే బాగుండుననిపించింది వామనరావుకి. దాహంగానే ఉంది. కానీ రేట్ల బోర్డు చూస్తే ఏదీ రూపాయి లోపలున్నట్లు లేదు.

''ఓ సోడా ఇవ్వు''

''నిమ్మ సోడానా సార్?''

''ఊఁ...'' నిమ్మసోడా అర్థరూపాయి. ఆలోచించకుండా ఊకొట్టినందుకు తనమీద తనే విసుక్కున్నాడు వామనరావు గొంతు తడుపుకోడానికి ఇరవై పైసలు మామూలు సోడాతో పోయేదానికి మరో ముప్పై పైసలు తగిలించుకున్నాడు. తన జాతకం అంతేమరి! ఓ క్రమం లేదు. ఓ నిర్ణయంలేదు. ఓ సంకల్పం లేదు. అనుకున్న పనులు చెయ్యలేకపోవడం, అనుకోనివి చేసెయ్యడం కూడా జరుగుతూనే వుంటుంది.

ఇంటరు పాసైన పెద్ద పిల్లకి పెళ్ళి చేద్దామన్నా చెయ్యలేడు.

చదివించలేనేమో అనుకున్న కొడుకు నారాయణని ఎలాగో చదువు పూర్తి చేయించి బి.ఎ. అనిపించేడు.

వాడిప్పుడు గోళ్ళు గిల్లుకుంటూ యింట్లో కూచున్నాడు.

వామనరావు సోడా తాగి డబ్బులిచ్చేడు. జేబులో డబ్బు పెట్టిన చోటు తడిమి చూసుకున్నాడు.

అక్షరాలా అయిదు వందల రూపాయలు! ఆఫీసులో అడ్వాన్స్ పెట్టి తీసుకున్నది-

ఆ డబ్బు తనకి తెగిన శరీర భాగంకిందే లెక్క. ఒళ్ళు చిట్లి, తునకలై, పెల్లుబికే రక్తం కిందే జమ, తన శ్రమ, తన చెమట, తన ఓపిక, తన బలహీనపడిన ఆరోగ్యం, ఊపిరి అన్నీ కలిపినా ఆ డబ్బు పాటి చెయ్యవ్.

మళ్ళీ నెల నుంచి జీతంలో మరో కటింగ్.

ఎలా బతకడమెలా బతకడం ? కాని -

కానీ, ఈ డబ్బు ఖర్చు చెయ్యకూడదు. బేంక్ చెయ్యాలి. కనీసం దీని కటింగ్ పూర్తయే వరకయినా సరే! దీన్ని మరి బేంక్ నుంచి విత్‌డ్రా చెయ్యకూడదంతే.

ఆ బేంక్ గుమస్తాగాడెప్పుడూ తను రావటం గమనిస్తే చాలు 'విత్‌డ్రాయలా మాష్టారూ!' అని పలకరిస్తాడు నవ్వుతూనే. గాడిద కొడుకు. తనంటే వాడికీ చులకనే తన పాస్‌పుస్తకంలో మినిమమ్ డిపాజిట్ తప్పిస్తే అదనంగా పది రూపాయలెప్పుడూ వుండవు. పిచ్చి తెగింపు పుట్టేసి, ఏ ఎరియర్సో వస్తే ఆ డబ్బు కాతాలో వెయ్యడం వారం తిరక్కుండానే తీసెయ్యడం తన కలవాటే. తన యిబ్బందులు వాడికేం తెలుస్తాయి ? ఈసారి వాడదిరిపోవాలి. ఈ అయిదొందలూ పడేసి మరి దాని జోలికెళ్ళకూడదు.

వామనరావుకి నవ్వొచ్చింది.

వాడి కోసం కాకపోయినా, తన కోసమైనా దాచాలికదా! ఈ డబ్బే తన అవసరాలప్పుడడిగితే యివ్వలేదనే కదూ నారాయణ ధైర్యంగా తననంతలేసి మాటలనగలిగింది!

ఎంత హీనంగా దులపరించిపారేసేడు ! ''అవసరానికడిగితే మీరెప్పుడు మాట విసరకుండా డబ్బిచ్చేరు గనుక- మీ దగ్గరెప్పుడూ ఉండదు- ఎందుకుంటుంది ? ఈ దిక్కుమాలిన కొంపలో పడితినడానికి నాతోపాటు మరో నలుగుర్ని సృష్టించిపడేసేరు- ఇప్పుడు కళ్ళుతెరిస్తే ఏం లాభం ? ముఖ్యమైన అవసరాలకి మూడు పైసలు మిగలవ్. మా బతుకులింతే, ఏడుస్తూ గడపాల్సిందే- చావలేక బతకాల్సిందే -''

తండ్రి అనే భయంలేదు. బాధపడతాడన్న ఆలోచనలేదు. అనకూడదన్న జ్ఞానంలేదు. ఎంత విసుగు ! ఎంత చీదర !

అన్ని మాటలనే బదులు -

''నన్నెందుకన్నావురా బడాచోర్' అని అరిచి. గుండెమీద గుండాగిపోయేలా ఓ తాపు తన్నేడుకాడు.

అప్పుడీ ఏడుపులే వుండవ్.

ఈసడింపులూ, విసుక్కోవడాలూ, అరుచుకోడాలూ, ఈ మూలగడాలూ, సాధింపులూ

ఏవీ వుండవ్.

పాత లుంగీ పంచెలు గుండెలమీద కప్పుకోడానికేడ్చే ఎదిగిన యిద్దరు కూతుళ్ళూ -

తిండి యావతో లేచింది మొదలు గీపెట్టే చంటి వెధవలూ -

అప్లికేషన్లు యింటర్వ్యూలు అంటూ రాని ఉద్యోగాల ఎండమావులని అంగలారుస్తూ వెదుక్కోడానికి డబ్బుకోసం పీడించే పెద్ద కొడుకు నారాయణా-

మందులో అనీ మొత్తుకునే రోగిష్ఠి తల్లీ- సంసారం ఈడవలేనని ఏడ్చుకునే భార్యా

- ఈ బాధలన్నీ, కనీసం తనకి తప్పిపోను. ఆ తరవాత వాళ్ళ ఏడుపేదో వాళ్ళేడుద్దురు.

ఇన్నేళ్ళ జీవితంలో - బతకడమంటే చావడం అనీ, చావడమంటే బతకడం అన్తప్ప తను మరింకేం తెలుసుకోలేకపోయాడు.

వామనరావుకి మళ్ళీ, తనిప్పుడెక్కడికెళ్ళాలనే ఆలోచనవచ్చి వేధించసాగింది. తప్పదు, ఎక్కడో ఓ చోట నాలుగు దినాలు గడపాలి. యిల్లుచేరే ప్రసక్తిలేదు. యింటికెళ్తే తల్లీ, భార్యా యింట్లో క్షణం ఉండనివ్వరు. ఇల్లొదిలి పారిపోయిన కొడుకుని వెతకడం కోసం తరమేస్తారు.

ఎక్కడని వెతకడం ? ఎంతని వెతకడం, వెతికి వాడ్ని యింటికి తీసికెళ్ళినా ఏం ప్రయోజనం గనక!

తన ఆలోచనలేవీ బయటికి చెప్పుకోడానికి లేదు. తన మనసు మారుమూలల్లో యిలాంటి చీకటి ఆలోచనలు ఉన్నాయని తెలిస్తే అంతా దుమ్మెత్తి పోస్తారు తనమీద. అసహ్యించుకుంటారు.

నారాయణ పారిపోయేడు. ఇల్లొదిలి పారిపోయేడు. నిజమే!

పది రోజుల క్రితం తెల్లారి లేచిచూస్తే నారాయణలేడు. రోజూ హాఫ్ ఫేంటుతో కుక్కి మంచంమీద అడ్డంగా పడిదొర్లుతూ- తన కళ్ళకి వెంటాడే భూతంలాగానో - కదలని కొండలాగానో వదలని ఏలినాటి శనిలాగానో కనిపించే నారాయణ లేడు! ముందురోజు వాడేదో కంపెనీకి అప్లయి చెయ్యడానికి పోస్టల్ ఆర్డర్ల కోసం డబ్బడిగితే నోటికొచ్చినట్టు తిట్టేసాడు తను.

ఆ కోపంతో యిల్లొదిలి పారిపోయేడు నారాయణ. తిరిగొస్తాడని ఆ రోజంతా ఎదురు చూసేరు తామంతా.

చీకటి పడే వేళకి యింట్లో రాగాలు మొదలయ్యాయి. పెడబొబ్బలు పెచ్చరిల్లేయి. పీనుగుపోయిన కొంపలా తయారయింది యిల్లు.

నలుగురి కోసం బాగుండదని చెప్పి తను విచారం వ్యక్తం చేసేలా ముఖం పెట్టేడు. దిగులు దిగమింగిన వాడిలా ప్రవర్తించేడు. కాని -

తన ఆలోచనల అడవిలో ఆనందమయూరం పురివిప్పి నాట్యం చెయ్యలేదూ!

దిగుళ్ళ కొండ దింపుకున్న వాడిలా మనసు తేలికపడినట్లు కాలేదూ!

అమానుషం! అనుచితం.

ఒక తండ్రి అంత క్రూరమైన ఆలోచనలు చెయ్యగలడని ఎవరూ ఊహించలేరు-

ఒక తండ్రి అంత నిర్లిప్తంగా ఉండడాన్ని ఎవరూ హర్షించలేరు.

ఒక తండ్రి కొడుకు యిల్లొదిలి పారిపోతే ఒక బరువుతీరిందని భావించడాన్ని ఎవరూ ఒప్పుకోరు!

కానీ నిజం - నిజమే!

ఈ క్రీలు పొంగిన జీవగడ్డలో యిలాంటి కఠిన వాస్తవాలెన్నో! చేదునిజాలెన్నో!

చిరంజీవి కన్నతండ్రీ వర్ధిల్లు -

పెళ్లికెదిగిన కూతుళ్ళు ఆ ముచ్చటతేరే దారి సుదూరతీరాలలో కనిపించక, వాకిటి దగ్గర నిలబడిచూసే అకలిచూపులూ-

విలువచచ్చిన డిగ్రీలకి ఉద్యోగాలొచ్చే దారీ తెన్నూ లేక - ఆ ఉక్రోషాన్నీ, కసినీ, కోపాన్నీ ఆవేదననీ వెర్రిపీరులాగా, చిందులేస్తూ యింట్లో వాళ్ళమీద చూపే కొడుకులూ-

ఇరుకు కొంపనీ, ఇరుకు బతుకునీ చూసి- సాగిలపడి గొణుక్కునే భార్యల సాధింపులూ-

రోగిష్టి తల్లుల, తండ్రుల మూలుగుల మంచాల కిర్రుకిర్రు చప్పుళ్ళూ-

ఇవన్నీ నీకు దీవెనలుకాగా-

చిరంజీవి కన్నతండ్రీ, దీర్ఘాయుష్మాన్భవ.

వామనరావుకి నవ్వొచ్చింది. అతనికి మళ్ళీ కర్తవ్యం స్ఫురించింది.

ఎక్కడికెళ్ళాలి ?

ఓ నాల్రోజులపాటు ఎవరి దగ్గర గడపాలి! కొడుకును వెతకడానికి బయల్దేరేడు తను.

నారాయణ యిల్లొదిలిపోయేక యింట్లో ఆడవాళ్ళ పోరుపడలేక బంధువులందరికీ ఉత్తరాలురాసేడు. వాళ్ళయిళ్ళకి నారాయణ చేరలేదంటూ అందరినుంచీ జవాబులొచ్చేయి.

దాంతో భార్య పిచ్చిదాన్లా తయారయింది.

ఒక్క క్షణం తనని కాలు ఒకచోట నిలవనివ్వటంలేదు.

పేపర్లో ప్రకటన వేయించాడు. ''కనబడుటలేదు'' అని.

ప్రకటనలు! ప్రకటనలు!

''తప్పిపోయినాడు''

పరీక్ష తప్పిపోయినాడు. ఉద్యోగాల ఎడారిలో తప్పిపోయినాడు- జీవితపు తిరునాళ్ళలో తప్పిపోయినాడు!

''కనబడుటలేదు''

ఘయం, బెంగాలేని బతుకులు కనబడుట లేదు -

నిరుద్యోగుల బాధలు గట్టెక్కే దారి కనబడుటలేదు-

కడుపునిండా అందరికీ తిండి దొరికే మార్గం కనబడుటలేదు-

పేపర్లో ప్రకటనపడ్డాక కూడా భార్య తనని దులపరించడం మానలేదు.

"వాడు పారిపోతే నిమ్మకు నీరెత్తినట్టుంటారేం ? నాలుగయిదు చోట్ల చూస్తే సరిపోతుందనుకున్నారా- వెతికించండి. వెర్రికన్న, ఎక్కడేం యిబ్బందులుపడుతున్నాడో అసలు వాడు యిల్లొదిలి పారిపోయింది మీవల్ల కాదూ! బి.ఎ. పేసయి అయిదేళ్ళయింది నిజమే. ఎన్నిచోట్లకెళ్ళినా, ఎంతఖర్చుపెట్టి యింటర్వ్యూలకి వెళ్తున్నా ఉద్యోగం వాడికి దొరకలేదు. నిజమే కాని దానివల్ల వాడి మనసెంత దుఃఖపడుతోందన్న యింగితం మీకుందా? వయసు పెరుగుతూ, ఇంటిపట్టున పడుండితిని తిరగాల్సి వొస్తోందని వాడెంతగా కుమిలిపోతున్నాడో అన్న ఆలోచనలేదెందుకు మీకు ? ఇంటర్వ్యూలకీ వాటికీ డబ్బు తగలెయ్యడం తప్పిస్తే నీ థర్డు క్లాసు డిగ్రీకి ఉద్యోగం వచ్చిందా, చచ్చిందా అంటూ వాడ్ని సూటీపోటీ మాటలతో వేధించుకుతిన్నారు మీ మాటలుపడ్లేక యిల్లొదిలిపోయేడు - ఛీ! కనడంకన్నాం, ఎందుకూ ! వాళ్ళ ఉసురుపోసుకోడానికితప్ప వెర్రి నా తండ్రి, ఎక్కడేం అవస్థలు పడుతున్నాడో" అంటూ రోజు భార్య కేకలు వెయ్యడమే.

తల్లి సంగతి సరేసరి, రాత్రీపగలూ ఒకటే ఏడుపు.

తన ఆలోచనలు వేరు-

నారాయణ ఉద్యోగ ప్రయత్నాలకోసం చెయ్యని అప్పులేదు. చేయిచాచి అడగని మనిషి లేడు. పెట్టుకోని బెంగలులేవు.

తను బాగా చితికిపోయేడు. విసిగిపేసారి పోయేడు. మరింక ఆ ఉద్యోగాలవేటకోసం ఖర్చు పెట్టగలిగే స్థితిదాటిపోయింది.

వాడి అత్తెసరు మార్కుల డిగ్రీకి ఈ ఉద్యోగాలు వేలంవేసే సంతలో- ఉద్యోగం దొరకడం దుర్లభం.

ఒక్కోరోజు ఆ బాధని అణుచుకోలేక, ఆ నైరాశ్యాన్ని భరించలేక "నీకీ జన్మలో ఉద్యోగంరాదొరే - నీ బతుకు నువ్వెలాగో బతకడానికి చూసుకో- ఏ బస్టాండులోనో కూలిగానో, ఏ హోటల్లో సర్వరుగానో, మరెలాగో వెళ్ళిచేరు. ఇంట్లోంచిపో-" అందామని నోటిదాకావచ్చి కూడా అనలేకపోయేవాడు.

వాడికి ఉద్యోగం రాదుగాకరాదు. వాడు తన బతుక్కి వొక గుదిబండ. వాడిల్లు వదిలిపారిపోతే బావుణ్ణు. ఒక బెంగయినా తీరుతుంది. అప్లికేషన్లు, పోష్టలు ఆర్డర్లు, రిజిస్ట్రేషను ఫీజులూ అంటూ- ఆ రాని ఉద్యోగం కోసం దరిచేరని అదృష్టాల కోసం అర్రులుచాస్తూ తనని వేధించడం తప్ప వాడింట్లో వుండడం వల్ల ఒరిగేదేం వుండదు-

అంచేత వాడిల్లు వదిలి పారిపోతే బాగుండునని తన మనసు మారుమూలల్లో ఎక్కడో అనిపించేది.

ఈ మాట వాడితోనే కాదు, ఎవరితోనూ అనలేడు. ఇలాంటి సమయంలో-

అగ్ని కత్తెర్లలో వడగళ్ళవానలా తోచింది తనకి, నారాయణ పారిపోవడం! 'హమ్మయ్య' అనుకున్నాడు తనలో.

'ఎక్కడో ఒకచోట కూలిపనయినా దొరికి ఎవరి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడకుండా రోజూ పట్టెడన్నం ముద్ద వాడికి దొరికేలా చూడు తండ్రీ!' అనుకున్నాడు మనసులో.

తనని తను ఎలాగో సంతృప్తిపరుచుకున్నా యింట్లోవాళ్ళ గొడవ ఎక్కువయింది. ఏడుపులూ. పెడబొబ్బలూ. తప్పింది కాదు తనకి. ఆఫీసులో అడ్వాన్సు తీసుకుని వాళ్ళ తృప్తికోసమే నారాయణని వెతకుతానని చెప్పి బయలుదేరాడు.

ఈ అనవసరపు ప్రయాసల కోసం డబ్బు నీళ్ళలా ఖర్చు చెయ్యడం వామనరావుకి నచ్చలేదు. అందుకే తన ఊరొదిలి దగ్గర్లోనే వున్న ఈ పట్నం చేరాడు.

ఇక్కడ తనకి తెలిసిన స్నేహితులు నలుగురైదుగురున్నారు. వాళ్ళెవరి దగ్గరకయినా వెళ్ళి. ఇక్కడికింకేదో పనిమీద వచ్చానని చెప్పి, వాళ్ళింట్లో నాలుగు రోజులు గడిపేయాలి. ఆ తరవాత తన ఊరు వెళ్ళిపోవాలి. తన ప్రయత్నాలలో లోపం లేదని తల్లికీ భార్యకీ నచ్చజెప్పాలి. వాళ్ళకి తెలీకుండా తనదగ్గిరున్న డబ్బు బ్యాంకులో వెయ్యాలి, మళ్ళీ ఎప్పుడెలాంటి అవసరాలొస్తాయో...

వామనరావు బాగా ఆలోచించి, ఆఖరికి తనతోపాటు కొన్నాళ్ళు కలిసి తమ ఊర్లోనే ఉద్యోగం చేసిన మాధవరావు ఇంటికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరాడు.

* * *

మాధవరావు కొన్నాళ్ళు వామనరావుచేసే అఫీసులోనే పనిచేసి, అంతకంటె పెద్ద ఉద్యోగంరాగా ఇక్కడికొచ్చేసేడు. వామనరావురాగానే అతన్ని ఆహ్వానించి ఆదరించేడు. ఇంట్లోకి తీసుకెళ్ళి యోగక్షేమాలడిగేడు.

అతని ఆదరణకి వామనరావు పొంగిపోయేడు. మాధవరావు పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసేసేడు. కొడుకుకూడా మంచి ఉద్యోగంలోనే స్థిరపడ్డాడు. ఇంట్లో వస్తువులూ అవీ- అతని సుఖజీవనానికి నిదర్శనంగా వున్నాయి. 'అదృష్టవంతుడు !' అనిపించింది వామనరావుకి. అతని సంసారంతో తన సంసారాన్నీ, జీవితాన్నీ పోల్చుకుని బాధగా నిట్టూర్చాడు ఊళ్ళో ఏదో ఆఫీసులో పనుందనీ, నాలుగైదురోజులుండాల్సివుందనీ అబద్ధం చెప్పాడు. దానికేం లేరా, నీ యిష్టం వచ్చినన్ని రోజులుండు. భలేవాడివే నాతో చెప్పాలా అని నవ్వేసేడు మాధవరావు.

థాంక్ గాడ్. వాడికి తన కొడుకు యిల్లొదిలిపోవడం తెలీదన్నమాట. మాధవ యింగ్లీషు పేపరు చదువుతాడు తెలుగుపేపర్లు చూడడు గాబోలు, అదీ ఒకందుకు మంచిదే అనిపించింది వామనరావుకి పూచీ పేచీ లేకుండా నాలుగు రోజులు గడిచిపోయాయి. మరో నాలుగు రోజులున్నా పట్టించుకునేరకం కాదు మాధవరావు.

కాని -

నాలుగో నాటి సాయంత్రం మాధవరావు ఆఫీసు బంట్రోతు ముఖ్యమయిన ఆఫీసు కాగితాలకి

చుట్టపెట్టి తెచ్చిన న్యూస్ పేపరు చూసి మతిపోయినట్లయింది వామనరావుకి.

అందులోనే తన కొడుకు ఫొటో, తనిచ్చిన ప్రకటనలున్నాయి.

ఏం చెయ్యాలో తోచలేదు వామనరావుకి.

అదృష్టం కొద్దీ మాధవరావు దృష్టి దానిమీద పడలేదు. అతను అక్కడలేని సమయంచూసి వామనరావు ఆ పేపరు తీసి మడతలు పెట్టి తన చేతి సంచిలో కుక్కేసాడు. అప్పటికి ప్రాణం కుదుటపడినట్టయింది.

ఆ తర్వాత హడావిడిగా మాధవరావు బలవంతం చేస్తున్నా వినకుండా వెళ్లొస్తానని చెప్పి బయల్దేరిపోయాడు.

తర్వాత ఈ విషయం మాధవరావుకి మరొకలాగెలాగయినా తెలియొచ్చు. కాని తన పరోక్షంలో తెలీడం మేలు.

భారంగా నిట్టూర్చి బస్టాండు వేపు దారితీసాడు వామనరావు. వాళ్ళ ఊరు మీదుగా పోయే బస్సు సిద్ధంగా ఉంది.

* * *

తల్లితోనూ, భార్యతోనూ, ఏమేం చెప్పాలో ఆలోచించుకుంటూ ఇంటికిచేరిన వామనరావు - నవ్వుతూ ఎదురొచ్చిన భార్యని చూసి చకితుడయిపోయాడు!

అతని చేతి సంచీ అందుకుంటూ చెప్పిందామె ! నారాయణ నిన్న సాయంత్రం వచ్చేసాడండీ ! ఏదో ఆవేశంలో యిల్లు వదిలి వెళ్ళిపోయేడు తప్ప వాడు మాత్రం పాపం, ఎక్కడని ఉండగలడు ! వాడ్ని వెతకడం కోసం మీరెక్కడెక్కడ తిరిగారో, ఎన్ని యిబ్బందులు పడ్డారో....

నారాయణ తిరిగి వచ్చేసాడని విన్నాక ఒక్క క్షణం తనకి తెలీకుండానే ఏదో రిలీఫ్‌నీ, సంతృప్తినీ అనుభవించేడు వామనరావు.

కానీ, అది కూడా ఒక్క క్షణం సేపు మాత్రమే !

ఒకే ఒక్క క్షణం - అంతే. తర్వాత మళ్ళీ మామూలే -

ఊపిరాడనివ్వని సమస్యల సుడిగుండాలలో మునకలు -

"తిండి తిని, నిద్ర పోతున్నాడు ... వాడ్ని మరి మీరేం అనకండి- అంటే నామీద ఒట్టే- అన్నట్టు, యివాళే వాడికి హైదరాబాదు నుంచి ఏదో యింటర్వ్యూకి రమ్మనమని ఉత్తరం వొచ్చిందండీ రేపే వెళ్ళాలిట ..." భార్య ఏదో చెప్తోందింకా.

వామనరావు చెయ్యి అప్రయత్నంగా డబ్బు లుంచిన జేబు మీదకి వెళ్ళింది.

అతన్ని వెన్నులోనుంచి చలి మొదలయింది.

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక 3.9.81)